

**అలరించిన తెలుగమ్మాయిలు**

విశాఖ వేదికగా తెలుగమ్మాయి పోటీల ముగింపు కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా జరిగింది. 8లో



**అధికారులదే కీలక బాధ్యత**

జగనన్నకు చెబుదాంలో ప్రతి అర్జీ పరిష్కారంలో అధికారులు బాధ్యతగా భావించాలని కలెక్టర్ సూచించారు. 8లో



**నేటి నుంచి రథోత్సవాలు**

టౌన్‌కొత్తరోడ్డులో జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 8లో

# విశాఖలో సీపెట్!

- ఇప్పటికే కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు
- ఇన్వెస్టర్లకు అవాంతరాలు లేని విశాఖ నగరం ఎంపిక
- భవిష్యత్తులో ఆర్థిక ప్రయోజనాల్లో పెట్రో కెమికల్ ముఖ్య భూమిక



సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సెంటర్ నమూనా

సాక్షి, విశాఖపట్నం : యువతకు ఉజ్వల అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నైపుణ్యం, మానవ వనరుల కోసం ఎదురు చూస్తున్న పరిశ్రమల్లో ఎక్కువగా అవకాశాలు లభిస్తాయన్న ఉద్దేశంతో.. కీలకమైన ఇనిస్టిట్యూట్స్‌ను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాబోయే కాలంలో అపార అవకాశాలు లభించే కోర్సుల్ని అందించే సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్)ని విశాఖలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

**నిపుణులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా...**

గ్రాడ్యుయేషన్ దశలోనే.. ఉపాధికి అవసరమయ్యే వినూత్న కోర్సుల్లో చేరుతూ చాలా ఈజీగా ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకుంటున్నారు ప్రస్తుత యువతరం. దానికి కావల్సిన అవకాశాల్ని సృష్టిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. ప్రస్తుతం మనం వాడే ప్రతి అవసరానికి ప్లాస్టిక్ అనేది కీలకంగా మారింది. గృహోపకరణాలు, ఫోన్లు.. వంటసామగ్రి.. ఇలా అనేక ఉత్పత్తులను తయారు చేసేందుకు దేశ, విదేశాల్లో చాలా కంపెనీలు ఉన్నాయి. అయితే ఈ రంగంలో పని చేసేందుకు నిపుణుల కొరత మాత్రం ప్రతి దేశంలోనూ వేధిస్తూనే ఉంది. అద్భుతమైన, అపారమైన అవకాశాలు ఉన్న ఈ రంగంలో నిపుణులను తయారు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం సీపెట్‌ని ప్రారంభించింది.

యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(యూఎన్‌డీపీ) సహకారంతో 1968లో భారత ప్రభుత్వం మొట్టమొదటి ఇనిస్టిట్యూట్‌ని చెన్నైలో ప్రారంభించింది. ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన వివిధ విభాగాల్లో నిపుణులైన ఉద్యోగులను అభివృద్ధి చేయడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం.

**విశాఖలో ఏర్పాటుకు ప్రణాళికలు**

దేశంలో పెట్రోలియం, కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్(పీసీపీఐఆర్) ప్రాజెక్టు 640 చ.కిమీ విస్తీర్ణంలో ఉన్న రాష్ట్రాలు నాలుగు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ కీలకంగా మారింది. పీసీపీఐఆర్ నోడ్ ఉన్న ఏపీలో ప్లాస్టిక్ ఇంజినీరింగ్‌లో అవకాశాలు పెరగనున్నాయి. పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంలో ఏపీ ఇప్పటికే టాప్‌లో ఉన్న తరుణంలో.. విశాఖపట్నం, నెల్లూరులో రెండు సీపెట్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ప్రతిపాదనలు పంపించింది. అదేవిధంగా.. ఇటీవలే రాష్ట్రానికి వచ్చిన కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ శాఖ కేంద్ర కార్యదర్శి అరుణ్ బరోకాతో చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి భేటీ అయ్యి.. ఇక్కడి పరిస్థితులు వివరించారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు త్వరలోనే రానున్నాయని అధికారిక వర్గాల సమాచారం. జూలై 27,28 తేదీల్లో ఢిల్లీలో జరిగే గ్లోబల్ కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ మూడో ఎడిషన్ సదస్సులో విశాఖలో సీపెట్ ఏర్పాటుపై నిర్ణయం వచ్చే అవకాశం ఉంది.

## జూ ఆధునికీకరణకు చర్యలు

- రాష్ట్ర పీసీసీఎఫ్ వై.మధుసూదనరెడ్డి
- మూడు ఎన్‌క్లోజర్లు ప్రారంభం



హిమాలియన్ బ్లాక్ బేర్ ఎన్‌క్లోజర్ ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ మధుసూదనరెడ్డి

**ఆరిలోవ :** సందర్శకులను ఆకట్టుకొనే విధంగా ఇందిరాగాంధీ జూ పార్కును తీర్చిదిద్దడానికి సన్నాహాలు జరుపుతున్నట్లు రాష్ట్ర పీసీసీఎఫ్ వై.మధుసూదనరెడ్డి తెలిపారు. ఇందిరాగాంధీ జూ పార్కును ఆయన సోమవారం సందర్శించారు. సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి, జూ క్యూరేటర్ నందనీ సలారియా, డీఎఫ్‌లు అనంతశంకర్, జి.లక్ష్మణరావు, సోమసుందర్‌తో కలసి ఆయన జూలో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఏఏ పనులు చేపట్టారో క్యూరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. జూ పార్కులో ఇటీవల వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లు, రోడ్డుకు మధ్యలో ఖాళీ స్థలంలో మట్టితో చదును చేయించారు. ఈ పనులలో నాణ్యత లేదని, వర్షం పడితే నీటితో ఆ మట్టి ఎన్‌క్లోజర్లలోకి చేరిపోయి సందర్శకులకు అసౌకర్యంగా మారుతుందని జూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సావనీర్ షాపు, దాని ఎదురుగా కొలను ఒడ్డున ఉన్న పూల పార్కు ఏటవాలుగా ఉండటంతో వర్షాలు కురిసినప్పుడు మళ్లీ పనులు చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అనంతరం ఇటీవల కొత్తగా నిర్మించిన మౌస్ డీర్, హిమాలియన్ బ్లాక్ బేర్, హిమాలియన్ గోరల్ ఎన్‌క్లోజర్లను ఆయన ప్రారంభించారు. వాటిలో ఆయా జంతువులను విడిచిపెట్టారు.

**త్వరలో ఉద్యోగ ఖాళీల భర్తీ**

ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సందర్శకుల నుంచి వచ్చిన ఆదాయంతో జూ పార్కులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. జూ పార్కులో ఏఏ అభివృద్ధి పనులు చేపట్టాలో అధికారులతో కలసి చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. జూలో ఉద్యోగ ఖాళీల భర్తీ, ఎన్నో ఏళ్లుగా తాత్కాలికంగా పనిచేస్తున్నవారిని శాశ్వత ఉద్యోగులుగా నియమించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొద్ది రోజుల్లోనే ఇక్కడ జూలో అవుట్ సోర్సింగ్ ద్వారా 5 నుంచి 10 మంది వరకు సిబ్బందిని నియమిస్తామన్నారు. జూలో వన్యప్రాణులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా వెటర్నరీ వైద్యులకు తర్ఫీదు ఇచ్చే కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. విదేశాలు, ఇతర జూ పార్కుల నుంచి జూకు తీసుకొచ్చిన జిరాఫీ, జీబ్రాలు మృతి చెందడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆయా జంతువులను మరో రెండు, మూడేసి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.

**జంతువులు తీసుకొచ్చేందుకు సన్నాహాలు**

జూ క్యూరేటర్ నందనీ సలారియా మాట్లాడుతూ చెక్ రిపబ్లిక్ నుంచి స్లమ్డర్ టెయిల్డ్ మీర్కట్, రెడ్ నెకెడ్ వాలబీ, స్కార్లెట్ మాకావ్, మిలటరీ మాకా, జపాన్ జూ నుంచి అల్డబ్రా జెయింట్ తాబేళ్లు ఇక్కడకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. వీటితో పాటు మనదేశంలో జునాగడ్ జూ పార్కు నుంచి ఆడ సింహం, చెన్నైలో మద్రాస్ క్రోకోడైల్ బ్యాంక్ ట్రస్ట్(ఎంసీబీటీ) నుంచి సాండ్ బోవా, ట్రావెన్‌కోర్ తాబేళ్లు, రెడ్‌క్రాన్డ్ తాబేళ్లు, తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూ డీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు బి.గోపి, పి.గోపాలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### మరిన్ని స్లాట్లు ఇవ్వాలి

ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌కు 'అపాటా' ప్రతినిధుల వినతి



ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న 'అపాటా' ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల విమానాలకు మరిన్ని స్లాట్లు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.రాజారెడ్డిని సోమవారం అసోసియేషన్ ప్రతినిధులు కె.కుమార్‌రాజా, డీఎస్ వర్మ, ఓ.నరేష్‌కుమార్‌లు కలిశారు. దుబాయ్ సహా విదేశాలకు విమాన సర్వీసులు పెరిగేందుకు ఎయిర్‌పోర్టులో అదనపు సదుపాయాలు కల్పించాలని కోరారు. నైట్ ల్యాండింగ్ సదుపాయాన్ని ఎక్కువగా వినియోగించాలన్నారు. అలాగే ఈ ఎయిర్‌పోర్టులో కార్గో సర్వీసుల పెంచాల్సిన అవసరాన్ని కూడా డైరెక్టర్‌కు వివరించారు. హైదరాబాద్, ముంబై, కోల్‌కతాలకు ఉదయం వేళ మరిన్ని విమాన సర్వీసులు, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరులకు రాత్రి పూట మరిన్ని విమాన సర్వీసులను పెంచాలని, ఫలితంగా అంతర్జాతీయ ప్రయాణికులకు వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు.

### స్వాత్మానందేంద్ర సరస్వతిని కలిసిన క్రికెటర్ భరత్



స్వాత్మానందేంద్ర సరస్వతితో మాట్లాడుతున్న క్రికెటర్ భరత్

సింహాచలం: విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిని భారత క్రికెటర్ కె.ఎస్.భరత్ కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. చాతుర్మాస దీక్ష కోసం సోమవారం విశాఖ నుంచి రిషికేష్ బయలుదేరిన స్వాత్మానందేంద్రని విశాఖ ఎయిర్‌పోర్టులో భరత్ కలిశారు. స్వామీజీతో కొంతసేపు మాట్లాడారు.

### పోర్టు ఉద్యోగులు యోగాసనాలు



యోగాసనాలు వేస్తున్న పోర్టు ఉద్యోగులు

సీతంపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ పోర్టు అథారిటీ యోగా సంబంధిత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఈ నెల 15 నుంచి 21 వతేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం 'యోగా ఫర్ వసుదైక కుటుంబం' థీమ్‌తో పోర్టు మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్, పోర్టు అథారిటీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పోర్టు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని యోగాసనాలు వేశారు. పోర్టు స్టేడియంలో ఈనెల 21న ఉదయం 6 గంటల నుంచి యోగా దినోత్సవం జరుగుతుందని, పాల్గొన దలచినవారు తమ పేరును https://yoga.ayush.gov.in పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపింది.

### ముగిసిన పునరుద్ధరణ పనులు



పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఎం

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, వాల్తేర్ డివిజన్ కేకే లైన్ పరిధి బొడ్డవర వద్ద ఆదివారం గూడ్స్ రైలు వేగన్స్ పట్టాలు తప్పడంతో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. వాల్తేర్ డివిజన్, డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి, ఇతర అధికారుల బృందం హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని పనులను పర్యవేక్షించారు. ప్రతికూల వాతావరణంలో నిరంతరాయంగా పనులను పూర్తి చేయించి సోమవారం ఉదయం 10 గంటలకు ట్రాక్‌లను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సోమవారం పలు రైళ్లు రద్దు చేశారు. కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్. విశాఖపట్నంలో బయల్దేరాల్సిన విశాఖ-కిరండూల్ (085510) పాసింజర్ స్పెషల్, కిరండూల్‌లో ఈనెల 20న బయల్దేరాల్సిన కిరండూల్ - విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు.

## బాలికలపై స్వామీజీ వేధింపుల పర్వం

- వేధింపుల తాళలేక ఓ బాలిక ఆశ్రమం నుంచి పరారీ
- ఓ కుటుంబం సహకారంతో సీడబ్ల్యూసీ చెంతకు..
- విజయవాడ దిశ స్టేషన్‌లో ఫిర్యాదు
- ఎంవీపీ పోలీసుల అదుపులో జ్ఞానానంద ఆశ్రమం పూర్ణానంద సరస్వతి స్వామీజీ





వెంకోజీపాలెం జ్ఞానానంద ఆశ్రమం (ఇన్‌సెట్) పూర్ణానంద సరస్వతి స్వామీజీ

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ)/ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): అనాథ మైనర్ బాలికకు(15) ఆశ్రయం కల్పించిన నిర్వాహకుడే రెండేళ్లుగా లైంగిక దాడులకు పాల్పడుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చైల్డ్ వేల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి గొలనుగొండకు చెందిన బాలిక తల్లిదండ్రులు చనిపోవడంతో సమీపంలో ఉండే ఒక మహిళ బాలికను ప్రభుత్వ హాస్టల్‌లో ఉంచి చదివించేది. ఆ మహిళా అధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎక్కువగా ఉండటంతో బాలికను గత రెండేళ్ల క్రితం విశాఖలోని వెంకోజీపాలెం జాతీయ రహదారిని ఆనుకొని జ్ఞానానంద, రామానంద ఆశ్రమం (సాధు మఠం) చేర్పించింది. ఆశ్రమ నిర్వాహకుడు పూర్ణానంద సరస్వతి స్వామీజీ బాలికతో పాటు మరో 13 మంది మైనర్ బాలికలతో పశువుల నిర్వహణ పనులు చేయిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడేవాడు. ఈ క్రమంలో భయంతో ఆశ్రమం నుంచి వెళ్లిపోతానని ఏడవటంతో బాలిక కాళ్లకు గొలుసులు కట్టి పనులు చేయిస్తుండేవాడు. ఈనెల 12న స్నానానికి వెళ్లేందుకు గొలుసులు తీయడంతో అక్కడ పనిచేసే ఒక మహిళ సహకారంతో బాలిక బయటకు పారిపోయి ఆటోలో రైల్వేస్టేషన్ వెళ్లి తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. రైలులో విశాఖ నుంచి విజయవాడ వస్తున్న ఒక కుటుంబం బాలికను చూసి వివరాలు అడిగి తెలుసుకుంది. తమతో పాటు కంకిపాడు తీసుకువెళ్లి కొన్ని రోజులు వాళ్ల ఇంట్లోనే ఉంచి సోమవారం కంకిపాడు పోలీసుల సహకారంతో విజయవాడలోని సీడబ్ల్యూసీ సభ్యులకు అప్పగించింది. వారు బాలికకు కౌన్సెలింగ్ నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలికపై జరుగుతున్న వరుస లైంగిక దాడులు తెలుసుకుని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ్రమం పేరుతో మైనర్ బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులపై బాలిక చేత దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. విజయవాడ పోలీసుల సమాచారం మేరకు ఎంవీపీ పోలీసులు రంగంలోకి దిగారు. ఆశ్రమానికి చేరుకొని కీచక స్వామీజీని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ ఘటనపై ఎంవీపీ సీఐ మాట్లాడుతూ విజయవాడలో జీరో ఎఫ్ఐఆర్ నమోదైందని, దీంతో పూర్తిస్థాయిలో దర్యాప్తు ప్రారంభించామని వెల్లడించారు. అయితే స్వామీజీని అదుపులోకి తీసుకోవడంపై ఆయన ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

**బాలిక మిస్సింగ్‌పై ఫిర్యాదు**

అసలు విషయాన్ని పక్కనపెట్టి సాధు ఆశ్రమం స్వామీజీ ఎంవీపీ పోలీసులను బోల్తాకొట్టించారు. ఏమీ తెలియనట్లు సాధు ఆశ్రమం నుంచి బాలిక అదృశ్యమైనట్లు ఈనెల 15న ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆశ్రమం వద్ద గల సీసీ కెమెరాలు పరిశీలించినా బాలిక వివరాలు తెలియరాలేదు.

## కునుకు తీస్తున్న వేళ.. కుండపోత!

- ఉరుములు, మెరుపులు, పిడుగులతో జడివాన
- నగరంలో 8 సెం.మీల భారీ వర్షపాతం నమోదు
- నెల రోజులుగా వడగాడ్పులతో సతమతం
- చల్లదనంతో నగర వాసులకు ఉపశమనం



చెరువును తలపిస్తున్న చావులమదుం జంక్షన్



50వ వార్డు వంశీనగర్ గెడ్డలో పడిపోయిన కారు

సాక్షి, విశాఖపట్నం: వారం, పది రోజులు కాదు.. దాదాపు నెల రోజులుగా వడగాడ్పులు, మండుటెండలు మలమల మాడుస్తున్న తరుణంలో అనుకోని అతిథిలా వచ్చిన వర్షం నగరవాసులకు ఎంతో ఊరటనిచ్చింది. సోమవారం తెల్లవారుజామున జనం కునుకు తీస్తున్న వేళ కుండపోతగా కురిసిన వాన హాయి గొలిపింది. ఆదివారం అర్ధరాత్రి దాటే వరకు వాతావరణం ఎప్పటిలాగే అసౌకర్యంగానే ఉంది. వేకువజామున రెండున్నర గంటల సమయానికి ఉరుములు, మెరుపులు మొదలయ్యాయి. ఆ వెంటనే పిడుగులు హడావుడి చేశాయి. వీటి ధాటికి నిద్రలో ఉన్న జనం ఉలిక్కిపడ్డారు. ఫెళఫెళమంటూ పిడుగులు భయకంపితులను చేశాయి. తమ పక్కలోనే పిడుగులు పడ్డాయా? అన్నంతలా ఇవి బేజారెత్తించాయి. ఒకపక్క ఇవన్నీ ఏకకాలంలో దాడి చేసినంత పని చేస్తుంటే జడివాన కురవడం మొదలైంది. దాదాపు గంటన్నరకు పైగా కురిసిన కుంభవృష్టికి నగరంలో 8 సెం.మీల భారీ వర్షపాతం నమోదైంది. ఇంకా నగరంలో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కూడా కురిసింది. తెల్లవారకముందే వర్షం కనుమరుగైంది. రోహిణి కార్తెను మించిన ఎండలతో అల్లాడిపోతున్న జనానికి జోరువాన ఉపశమనం కలిగించింది. వాన వెళ్లిపోయాక సోమవారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని ఎప్పటిలా కాకుండా తీవ్రతను తగ్గించుకున్నాడు. ఫలితంగా రోజంతా సాధారణ వాతావరణమే కొనసాగింది. నిన్న, మొన్నటి వరకు 40–44 డిగ్రీల మధ్య నమోదవుతున్న ఉష్ణోగ్రతలు సోమవారం ఒక్కసారిగా తగ్గుముఖం పట్టి 34.8 డిగ్రీలకే పరిమితమైంది. అంటే ఆదివారం నాటి 41.4 డిగ్రీలతో పోల్చుకుంటే ఏడు డిగ్రీలు తక్కువగా నమోదై ఊరటనిచ్చింది. రానున్న రోజుల్లో రుతుపవనాల ఆగమనంతో ఎండల తీవ్రత తగ్గడంతో పాటు వర్షాలు కూడా మొదలై చల్లదనాన్ని పరచుకుంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు పిడుగుల ధాటికి అనకాపల్లి జిల్లా సబ్బవరంలో పిడుగుపాటుకు 18 మేకలు మృత్యువాత పడ్డాయి. నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలో ఓ పురాతన ఇల్లు పాక్షికంగా కూలిపోయిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. నగరంలో కొన్ని చోట్ల చెట్లు కూడా కూలాయి.

| ప్రాంతం | వర్షపాతం (సెం.మీల్లో) |
|---|---|
| మహారాణిపేట | 8.0 |
| రైల్వే న్యూ కాలనీ | 5.2 |
| మధురవాడ జాతర | 5.0 |
| విశాఖపట్నం రూరల్ | 5.0 |
| పెందుర్తి | 4.7 |
| మల్కాపురం | 4.2 |
| ఎండాడ | 4.0 |
| సీతమ్మధార | 3.9 |
| మాధవధార | 3.9 |
| శ్రీహరిపురం | 3.6 |
| గోపాలపట్నం | 3.1 |

## పలు రైళ్లు రద్దు



తాటిచెట్లపాలెం : ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో భద్రతా పనుల నిమిత్తం పలు రైళ్లు రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ఎర్నాకుళంలో ఈనెల 19న బయల్దేరాల్సిన ఎర్నాకుళం - పాట్నా (22643) ఎక్స్‌ప్రెస్, పాట్నాలో ఈనెల 22న బయల్దేరాల్సిన పాట్నా - ఎర్నాకుళం (22644) ఎక్స్‌ప్రెస్, బెంగళూరులో ఈనెల 21న బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు - హౌరా (22864) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. అలాగే షాలిమార్‌లో ఈనెల 20న బయల్దేరాల్సిన షాలిమార్ - హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దు. హైదరాబాద్‌లో బయల్దేరాల్సిన హైదరాబాద్ - షాలిమార్ (18046) ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమార్‌లో బయల్దేరాల్సిన షాలిమార్ - చెన్నై సెంట్రల్ (22825) ఎక్స్‌ప్రెస్, షాలిమార్‌లో బయల్దేరాల్సిన షాలిమార్ - విశాఖపట్నం (22853) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చిలో బయల్దేరాల్సిన సంత్రగచ్చి - చెన్నై సెంట్రల్ (22807) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్‌లో బయల్దేరాల్సిన సికింద్రాబాద్ - షాలిమార్ (12774) ఎక్స్‌ప్రెస్, విల్లుపురంలో బయల్దేరాల్సిన విల్లుపురం - ఖరగ్‌పూర్ (22604) ఎక్స్‌ప్రెస్, హౌరాలో బయల్దేరాల్సిన హౌరా - ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ (22887) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. చెన్నై సెంట్రల్‌లో ఈనెల 22న బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి (22808) ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్‌లో ఈనెల 21న బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్ - షాలిమార్ (22826) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

## యోగా దినోత్సవానికి ఏర్పాట్లు

**కలెక్టర్ మల్లికార్జున**



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో జేసీ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట: స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ మల్లికార్జున చెప్పారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహిస్తామన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు యోగ దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులు, ఆసక్తి గల యువతీయువకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. స్టేడియం వద్ద పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరాపై ఆ శాఖ అధికారులతో చర్చించారు. స్టేడియం అంతటా సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. యోగాపై ఆసక్తి ఉన్న పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించాలని ఆదేశించారు. యువజన శాఖ అధికారులు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల భాగస్వామ్యం ఉండేలా చూడాలన్నారు. అనంతరం యోగా డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఆయుష్ శాఖ సీనియర్ వైద్యాధికారి వెంకట్రావు, ఆయుష్ వైద్యాధికారులు, పతాంజలి, ఆర్ట్ ఆఫ్ లివింగ్, నేచర్ క్యూర్, పుష్పాంజలి, ఏయూ యోగా విలేజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్ రాంబాబు అరెస్ట్

సీతమ్మధార: గతేడాది డిసెంబర్ 18న దొండపర్తి నెహ్రూ బజారు వద్ద జరిగిన ఘర్షణతోపాటు గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న రౌడీ షీటర్ జగ్గుపల్లి రాంబాబు(అలియాస్ బాతుడు) ఎట్టకేలకు ద్వారకా జోన్ పోలీస్‌లకు చిక్కాడు. నగరంలోకి రాంబాబు వచ్చినట్లు సమాచారంతో ద్వారకా ఏసీపీ ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి ఆదేశాల మేరకు ఎస్ఐ అప్పలరాజు ఆదివారం అర్ధరాత్రి మూడు గంటల సమయంలో పీఎం పాలెంలో అదుపులోకి తీసుకుని విచారించారు. సోమవారం రాంబాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇతడిపై రౌడీ షీట్ ఉంది. 2020 కంచరపాలెం కేసు, 2018 ఖాసీమ్ హత్య కేసులో నిందితుడు. దీంతోపాటు పలు కేసుల్లో ఉన్నాడు.

## సన్‌షేడ్ కూలి ఇద్దరికి గాయాలు



కూలిన భవనం, సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

జగదాంబ: నగరంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి డాబాపై ఉన్న ఓ రేకుల షెడ్డు, రెండో అంతస్తులో సన్‌షేడ్ కూలిపోయాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. టౌన్ కొత్తరోడ్డు, వెలంపేట సమీపంలోని రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డులో ఓ భవనంలోని రెండో అంతస్తులో ఐదుగురు కుటుంబ సభ్యులు నివాసముంటున్నారు. పాత భవనం కావడంతో వర్షానికి నానిపోయి సోమవారం ఉదయం 7 గంటల సమయంలో రేకుల షెడ్డు, రెండో అంతస్తులోని సన్‌షేడ్ కూలిపోయాయి. ఆ సమయంలో రెండో అంతస్తు బాల్కనీలో ఉన్న చిట్టిబోయిన నాగరాజు, ప్రవీణ్ స్వల్పగాయాలయ్యాయి. అక్కడే ఉన్న మరో వ్యక్తి సురక్షితంగా బయటపడ్డాడు. వన్ టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ పార్వతమ్మ, ఎస్ఐ సంతోష్, అగ్నిమాపక కేంద్రం అధికారి సింహాచలం ఆధ్వర్యంలో వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అగ్నిమాపక సిబ్బంది చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

# నేటి నుంచి జగన్నాథుని రథోత్సవాలు



ఉత్సవాల వివరాలు వెల్లడిస్తున్న ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి, అర్చకులు

డాబాగార్డెన్స్ : నగరంలోని టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాలు మంగళవారం నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవ కార్యక్రమ వివరాలు ఆయన వెల్లడించారు. సోమవారం నేత్రోత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, సుభద్రాదేవి శాంతి కల్యాణం నిర్వహించినట్టు చెప్పారు. మంగళవారం ఉదయం 7.35 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నామని, సాయంత్రం 5 గంటలకు జగన్నాథస్వామి తొలి రథయాత్ర ఉత్సవాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌తో పాటు దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నట్టు తెలిపారు. 21 నుంచి 29వ తేదీ వరకు టర్నర్ చౌల్ట్రీలో గల కల్యాణ మండపంలో దశావతారాల్లో స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారని చెప్పారు. జూలై ఒకటి ఉదయం 9 గంటలకు సంప్రోక్షణ, పీఠారోహణం అనంతరం స్వామిని యథాస్థానంలోకి పెట్టనున్నామని పేర్కొన్నారు. 21 నుంచి 29వ తేదీ వరకు నిత్యపూజలు నిర్వహించనున్నామని, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 9 రోజుల పాటు పాల్గొనే భక్తులు దేవస్థాన కార్యాలయంలో రూ.500 చెల్లిస్తే గోత్ర నామాలతో ఆయా రోజుల్లో పూజ జరిపించనున్నామని, దశావతార అలంకరణలు చేయుదలచు భక్తులు ముందుగా ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.రాజగోపాల్‌రెడ్డి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అర్చకులు పి.జగన్నాథచార్యులు, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో సరకులు అందజేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా క్రమం తప్పకుండా నిత్యావసర సరకులు అందజేయాలని జేసీ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఐసీడీఎస్ మానటరింగ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, బాలింతలకు ఇచ్చే బియ్యం, కందిపప్పు, నూనె, వైఎస్సార్ కిట్లు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. ఎస్‌డీజీ ఇండికేటర్స్, బాలింతల్లో రక్తహీనత, బరువు తక్కువగా ఉన్న పిల్లల వివరాలను అంగన్‌వాడీ సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. వచ్చే సమావేశం నాటికి పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించా రు. నాడు–నేడు పనుల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ డి.వెంకటేశ్వరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, సీడీపీవోలు ఎంవీ రమణ కుమారి, డి.నీలమణి, ఎం.శ్రీదేవి, ఎల్.సుజాత పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలకు సాయికౌశిక్



సాయికౌశిక్

విశాఖ స్పోర్ట్స్: నగరానికి చెందిన సాయికౌశిక్ సౌత్‌జోన్ షూటింగ్ పోటీలకు అర్హత సాధించాడు. హైదరాబాద్‌లో ఈనెల 18న జరిగిన అంతర జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీల సబ్ జూనియర్ బాలుర విభాగంలో పాల్గొని 400కి 388 పాయింట్లు సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న సాయి కౌశిక్ పలుమార్లు సత్తాచాటి పతకాల్ని సొంతం చేసుకున్నాడు. కౌశిక్‌కు తల్లి దండ్రులు సంధ్యా, శ్రీనివాస్, కోచ్ గణేష్ సహకారం అందిస్తున్నారు.

# అర్జీల పరిష్కారంలో అధికారులదే కీలక బాధ్యత



జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరైన వివిధ విభాగాల అధికారులు

- కలెక్టర్ డా.మల్లికార్జున సూచన
- 'జగనన్నకు చెబుదాం'కు 210 విజ్ఞప్తులు

సాక్షి, విశాఖపట్నం : జగనన్నకు చెబుదాంలో వచ్చే ప్రతి అర్జీ పరిష్కారంలో సంబంధిత అధికారుల బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ డా.మల్లికార్జున సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు.

ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించిన డా.మల్లికార్జున మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్‌లో నమోదైన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారం విషయంలో నిర్లిప్తంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఎల్ఏ పీరియడ్ అవ్వకముందే పిటిషన్‌దారుడితో మాట్లాడి వారికి వివరాలు తెలియజేసి పరిష్కరించాలన్నారు. ఎండార్స్‌మెంట్ చేసేటప్పుడు అధికారులు దానిని నిర్ధారించి చేయాలని కలెక్టర్ సూచించారు. సోమవారం అందిన అర్జీల్లో రెవెన్యూకు సంబంధించి 86, జీవీఎంసీ 46, పోలీస్ శాఖకు సంబంధించి 16, ఇతర విభాగాలకు సంబంధించి 62 ఫిర్యాదులందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**వైద్యుల నిర్లక్ష్యం వల్లే నా కుమార్తె మృతి**

చినగదిలిలోని అపోలో ఆస్పత్రిలో తన కుమార్తె డా.సాయి సంతోషి ప్రసన్నలక్ష్మికి అవసరం లేకపోయినా మల్టిపుల్ బ్రెయిన్ సర్జరీలు చేశారంటూ పలాసి నాగేశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తన కుమార్తె మృతి చెందిందని, ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత ఆహారం..




జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అధికారులకు అర్జీలు అందించేందుకు వచ్చే ప్రజలకు రెడ్ క్రాస్ సొసైటీ ఉచితంగా ఆహారాన్ని పంపిణీ చేసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ మంచినీటితో పాటు అల్పాహారం, ఆహారం అందించింది.

## 'జగనన్నకు చెబుదాం'కు 77 వినతులు



ఫిర్యాదు స్వీకరిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం..కార్యక్రమానికి 77 వినతులు వచ్చాయి. కమిషనర్ సాయికాంత్‌వర్మ ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో జోన్–2 నుంచి 12, జోన్–3 నుంచి ఐదు, జోన్–4 నుంచి 14, జోన్–5 నుంచి ఆరు, జోన్–6 నుంచి 16, జోన్–7 నుంచి రెండు, జోన్–8 నుంచి ఐదు ఫిర్యాదులు అందగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 17 ఫిర్యాదులు వచ్చాయని కమిషనర్ తెలిపారు. ప్రతి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులు, సలహాలపై వచ్చే వారం నిర్వహించే కార్యక్రమంలో నివేదిక సమర్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు రవి కృష్ణరాజు, ప్రధాన సిటీ ప్లానర్ సునీత, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, కార్యదర్శి పి.నల్లనయ్య, డీసీ (రెవెన్యూ) ఫణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, డీడీహెచ్ దామోదరరావు, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీపీవో చంద్రిక, పర్యవేక్ష ఇంజినీర్లు కేవీఎన్ రవి, వినయ్‌కుమార్, వేణుగోపాలరావు, కృష్ణారావు, గోవిందరావు, రామ్మోహనరావు, శ్యాంసన్‌రాజు, బయాలజిస్ట్ చక్రవర్తి, టీపీఆర్‌వో సూర్యకళ, డీసీపీలు, ఏసీపీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ స్పందనకు 61 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 61 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ (ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, లీగల్ అడ్వైజర్ పీవీ రామకృష్ణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## మాస్క్ ధరించండి..



మాస్క్ పెడుతున్న వైద్య సిబ్బంది

కలెక్టరేట్‌కు అర్జీలు అందజేసేందుకు వచ్చిన ప్రజలకు వైద్యారోగ్య శాఖ సిబ్బంది మాస్కులు అందించారు. దివ్యాంగులు, వృద్ధులకు సిబ్బంది స్వయంగా మాస్కులు కట్టారు. విధిగా మాస్కులు ధరించి.. పరిశుభ్రతని పాటించి.. ఆరోగ్యంగా ఉండాలని ప్రతి ఒక్క అర్జీదారుడికి అవగాహన కలిగించారు. రాబోయే వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## లారీ ఢీకొని వివాహిత దుర్మరణం



సాయి ప్రసన్న మృతదేహం

కూర్మన్నపాలెం : అనారోగ్యానికి గురైన ఓ వివాహిత ఆస్పత్రికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా లారీ బలంగా ఢీకొనడంతో మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... మింది గ్రామానికి చెందిన గోరపల్లి లౌఖ్య సాయి ప్రసన్న (35) ఆరోగ్యం బాగోలేకపోవడంతో చికిత్స కోసం అగనంపూడి ఆస్పత్రికి తన ద్విచక్ర వాహనంపై వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తుండగా శనివాడ జంక్షన్ వద్ద లారీ బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైంది. వెంటనే ఆమెను సమీపంలోని అగనంపూడి ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుది శ్వాస విడిచింది. మృతురాలి భర్త రవికుమార్ షిప్‌యార్డ్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వీరికి 9 సంవత్సరాల పాప రిషిక ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించిన పోలీసులు, భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'తెలుగమ్మాయి' రాఘవిక

- ముగిసిన పోటీలు
- అలరించిన మహిళలు




విజేతలుగా నిలిచిన మహిళలు

ఎంవీపీకాలనీ: విశాఖ వేదికగా జరుగుతున్న తెలుగమ్మాయి పోటీల ముగింపు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈవెంట్ డైరెక్టర్ వీరుమామ ఆధ్వర్యంలో లలిత జ్యుయలర్స్ ఈ ముగింపు పోటీలను ఎంవీపీ కాలనీలో నిర్వహించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విభాగాల్లో వివాహితలు, అవివాహితలు కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాంప్‌పై అలరించారు. ఈ పోటీల్లో భాగంగా ఆన్‌లైన్ విభాగంలో తొలి విజేతగా రాఘవిక, ద్వితీయ విజేతగా నక్షత్ర, తృతీయ విజేతగా గీత నిలిచారు. ఆఫ్‌లైన్ విభాగం విజేతగా ప్రశాంతి నిలవగా, తెలుగమ్మాయి అవివాహితలు కేటగిరీలో రోహిణి, నిత్యవర్షిణి, ప్రత్యూష, సాయి దివ్య తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయ నిర్ణేతలు, అతిథులు పాల్గొన్నట్లు వీరుమామ వెల్లడించారు.

## ఏజెన్సీలో ప్రమాదం : మధురవాడ యువకుడి మృతి

డుంబ్రిగుడ : చాపరాయి జలపాతం తిలకించేందుకు సోమవారం అరకులోయ నుంచి డుంబ్రిగుడ వస్తుండగా అంత్రిగుడ సమీపంలో ప్రమాదవశాత్తూ బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. విశాఖపట్నం మధురవాడ వాంబే కాలనీకి చెందిన లకకుల రాజేష్ (23) ఓ మహిళతో కలిసి బైక్ మీద వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ముఖం మీద తీవ్ర గాయలు కావడంతో పాటు ఎడమ చేయి విరిగిపోయింది. స్థానికుల సహకారంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

## వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు



అజయ్ కుమార్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

అల్లిపురం: మనస్తాపంతో ఇంటి నుంచి బయటకు వచ్చి బీచ్‌లో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్గొండ జిల్లాకు చెందిన అజయ్‌కుమార్ కుటుంబ సమస్యలతో విశాఖ చేరుకున్నాడు. జగదాంబ జంక్షన్ నుంచి వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తన నిస్సహాయతను వ్యక్తం చేశాడు. అతను ఏదో ప్రమాదంలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు భావించి విశాఖ పోలీసులకు ఫోన్‌లో సమాచారం అందించారు. వన్‌టౌన్ సీఐ ఎల్.రేవతమ్మ ఆదేశాలతో ఆదివారం రాత్రి విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రామ్‌కుమార్ ఫోన్ ఆధారంగా సాంకేతికతను ఉపయోగించి అజయ్‌కుమార్ కోస్టల్ బ్యాటరీ బీచ్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. వెంటనే స్పందించిన ఆయన బీచ్‌లో దిగబోతున్న అజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా సోమవారం రాత్రి నగరానికి చేరుకున్న వారికి అతడిని అప్పగించారు. దీంతో వారు వన్‌టౌన్ పోలీసులు సీఐ ఎల్.రేవతమ్మ, ఏఎస్ఐ కుమారస్వామి, కానిస్టేబుల్ పీటీవీఎస్ రామ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. అత్యంత సాహసంతో వ్యక్తి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ పీటీవీఎస్ రామ్‌కుమార్‌ను పోలీస్ కమిషనర్ సీహెచ్.త్రివిక్రమ్ వర్మ ప్రత్యేకంగా అభినందించారు.

## కారు దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ జోన్-1 క్రైం ఏసీపీ సునీల్

అల్లిపురం (విశాఖ దక్షిణం): కార్‌వాష్ సెంటర్ వద్ద పార్క్ చేసిన కారును దొంగిలించిన వ్యక్తిని మహారాణిపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ దరి సెంట్రల్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం ఏసీపీ బి.సునీల్ వివరాలు వెల్లడించారు.

జిల్లాపరిషత్ దరి కనకదుర్గా నర్సింగ్ హోం వద్ద శ్రీ కనకమహాలక్ష్మీ కార్‌వాష్ సెంటర్‌ను ముద్దాన శ్రీనివాసరావు నడుపుతున్నాడు. ఈ నెల 16న డాక్టర్ సంతోష్ తన స్విఫ్ట్ కార్‌ను వాషింగ్ నిమిత్తం సర్వీసింగ్ సెంటర్‌కు తీసుకువచ్చి అప్పగించారు. సిబ్బంది కారు వాష్ చేసి సర్వీసింగ్ బయట పార్క్ చేసి తాళాలు కౌంటర్‌లో అప్పగించారు. కాసేపటికి పార్కింగ్ ఏరియాలో కారు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా కనిపించక పోవడంతో 18న ముద్దాన శ్రీనివాసరావు మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన క్రైం ఎస్.ఐ కె.నెమరం బాబు.. నగర క్రైం డీసీపీ జి.నాగన్న, ఏడీసీపీ డి.గంగాధరం సూచనల మేరకు ఈస్ట్ క్రైం సీఐ వై.ఎర్రంనాయుడు పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు పెదవాల్తేరు, ప్రియదర్శినీ కాలనీకి చెందిన వాసుపల్లి ఎల్లాజీ అలియాస్ రాసుని సోమవారం బీచ్‌రోడ్డులో సీ పెరల్ జంక్షన్‌లో అదుపులోకి తీసుకుని స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు.

**ల్యాప్‌టాప్ దొంగ అరెస్ట్..**

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గల హోటల్‌లో భోజనానికి వచ్చిన బెవర హేమ రాజేష్‌కు చెందిన ల్యాప్‌టాప్‌ను దొంగిలించిన వ్యక్తిని టూటౌన్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. క్రైం ఏసీపీ బి.సునీల్ తెలిపిన వివరాల ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండ, అర్దలి గ్రామానికి చెందిన బెవర హేమ రాజేష్ ఈ నెల 17న హైదరాబాద్ నుంచి విశాఖకు రైలులో వచ్చాడు. అక్కడ పాలకొండ వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నాడు. అతని స్నేహితుడితో కలసి ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సాయి సుధా హోటల్‌లో భోజనం చేశాడు. ఆ సమయంలో అతను తెచ్చుకున్న ల్యాప్‌టాప్‌తో కూడిన బ్యాగు పక్కన పెట్టాడు. లంచ్ అయిన తరువాత చూస్తే బ్యాగు కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితంలేకపోయింది. దీంతో చేసేది లేక పాలకొండ వెళ్లిపోయాడు. అక్కడ బంధువులు, కుటుంబ సభ్యుల సూచన మేరకు ఈ నెల 18న టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో టూటౌన్ క్రైం ఎస్.ఐ కె.శ్రీను..ఈస్ట్ క్రైం సీఐ వై.ఎర్రంనాయుడు పర్యవేక్షణలో దర్యాప్తు చేయగా.. శ్రీకాకుళం జిల్లా, పాలకొండ, ప్రకాశరావు పేటకు చెందిన సింగుపురపు వేణుగోపాలరావును అదుపులోకి తీసుకొన్నారు. అతని నుంచి ల్యాప్‌టాప్, బ్యాగు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

## టీడీపీతో వచ్చినా.. విడిగా వచ్చినా తమదే విజయం

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు ముత్తంశెట్టి కౌంటర్

ఆనందపురం: పవన్ కల్యాణ్ అసందర్భంగా, చవకబారు మాటలు మాట్లాడితే జనాలు ఓట్లు వేయరని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆయన సోమవారం ఆనందపురంలో మాట్లాడారు. జనసేన ఒంటరిగా వచ్చినా టీడీపీతో కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీకి ఇబ్బంది లేదని, మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అవుతారన్నారు. రోడ్డు షోలో బట్టలూడదీసి కొడతాం అంటూ పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడం సీఎం స్థానానికి పోటీ పడుతున్న వ్యక్తి పలికే మాటలేనా అని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి పేదలు బాగుండాలని కోరుకుంటే పవన్ కల్యాణ్ చంద్రబాబు బాగుండాలని కోరుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. మాట్లాడితే కులం అంటాడు. అతనికి ఒక్కడికే కులం ఉందా... జగన్‌మోహన్‌రెడ్డి కులాలకతీతంగా పథకాలు అమలు జరుపుతున్నారని అందులో జనసేన పార్టీ వారు ఉన్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి స్పష్టం చేశారు. కరోనా సమయంలో 1.25 కోట్ల కుటుంబాలకు రెండు లక్షల కోట్లతో ఆసరా కల్పించారని అందులో జనసేన పార్టీ వారు లబ్ధిపొందారని గుర్తు చేశారు. మాటలు కాకుండా చేతలతో చూపే జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ, సినీ డైలాగ్‌లు చెప్పే పవన్‌కల్యాణ్ ఎక్కడ అంటూ ప్రశ్నించారు. ఇచ్ఛాపురం నుంచి ఇడుపులపాయ వరకు జనం జగన్ వెంటే ఉన్నారని జగనే రియల్ హీరో అన్నారు. ఎన్ని చేసినా పవన్ కల్యాణ్ మాటలు వినే స్థితిలో ప్రజలు లేరని పేర్కొన్నారు.

## కలెక్టర్‌తో ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ భేటీ



కలెక్టర్ మల్లికార్జునకు బొకే అందజేస్తున్న ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ రాజారెడ్డి

మహారాణిపేట: విశాఖ ఎయిర్ పోర్ట్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజారెడ్డి సోమవారం మధ్యాహ్నం వీఎంఆర్డీఏ కార్యాలయంలో కలెక్టర్ డా.ఎ మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజారెడ్డికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విస్తీర్ణం పరంగా జిల్లా చిన్నదైనా ఆర్థిక పరంగా రాష్ట్రంలో ముందుందన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు మంచి పేరు తీసుకురావాలని ఎయిర్ పోర్ట్ డైరెక్టర్‌కు రాజారెడ్డికి కలెక్టర్ మల్లికార్జున సూచించారు.

### అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

పీఎం పాలెం: అప్పుల బాధలు అధికమవడంతో ఓ వ్యక్తి పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 6వ వార్డులో గల రేవళ్లపాలెంలో కుటుంబంతో నివసిస్తున్న వై.నర్సింగరావు రియల్టర్. చేతికి దొరికినంత అప్పులు చేశాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులు తీర్చలేక మానసికంగా కుంగిపోయాడు. రెండు రోజుల క్రితం పని మీద బయటకు వెళ్తున్నానని భార్యకు చెప్పాడు. కానీ వెళ్లలేదు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో అతను నివసిస్తున్న ఇంటి సమీపంలో గ్రౌండ్‌కు బైక్‌మీద వెళ్లి కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు కాలిన గాయాలతో ఉన్న నర్సింగరావును కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అప్పుల బాధ లు తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో నర్సింగరావు తెలిపారు.